కాంగ్రెస్ గెలిస్తే అధోగతే.. బీఆర్ఎస్ గెలిస్తే అభివృద్ధి

సత్తుపల్లి టౌన్: సండ్రకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్న సండ్ర సతీమణి మహాలక్ష్మి తల్లాడ: కుర్నవల్లిలో సండ్ర తనయుడు తేజ, పెనుబల్లిలో బీఆర్ఎస్ నాయకులు

సత్తుపల్లి టౌన్, నవంబర్ 23: కార్పొరేట్ కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, బీఆర్ఎస్ గెలిస్తే అభివృద్ధి చెందుతుందని న్యాయవాది కొండూరి రత్న కుమారి అన్నారు. గురువారం సండ్ర వెంకటవీరయ్య సతీమణి మహాలక్ష్మి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో సండ్ర గెలిస్తే సమాజానికి సేవచేసే వ్యక్తి గెలిచినట్లు అవుతుందని, కాంగ్రెస్ గెలిస్తే షాడో ఎమ్మెల్యే తయారవుతారని చెప్పారు. సండ్ర 15 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో ప్రతి కుటుంబంలో ఒక ఆప్తుడుగా ఉన్నారని, అలాంటి వ్యక్తి కోసం అందరం సహకరించాలని కోరారు. వైద్యరంగంలో ఉన్నామని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఏ రోజన్నా ప్రజలకు ఉచితంగా సేవచేశారా అని ప్రశ్నించారు. హస్తం గుర్తుకు ఓటు వేస్తే మన ప్రాంతాన్ని మనం పాడుచేసుకున్నట్లు అవుతుందన్నారు. గుర్తుల కోసం కాదు మనం వ్యక్తుల కోసం పనిచేయాలన్నారు. తన భర్త కొండూరి సుధాకర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి బంగపడిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరినీ మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని ఆవేదన చెందారు. ఇలాంటి కార్పొరేట్ పార్టీని ఓడించాలని చెప్పారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అందుకే ప్రతిఒక్కరూ కారు గుర్తుపై ఓటేయాలని ఆమె కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, సండ్ర సతీమణి మహాలక్ష్మి, వార్డు కౌన్సిలర్ వీరపనేని బాబి రాధిక, యువజన అధ్యక్షుడు వల్లభనేని పవన్, అద్దంకి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి టౌన్: మాట్లాడుతున్న కొండూరి సుధాకర్ సతీమణి రత్నకుమారి. పక్కన సండ్ర సతీమణి మహాలక్ష్మి

సండ్ర సతీమణి ఇంటింటి ప్రచారం

సత్తుపల్లి టౌన్, నవంబర్ 23: పట్టణంలోని 15వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపును కాంక్షిస్తూ సతీమణి మహాలక్ష్మి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి మూడుసార్లు ఎమ్మెల్యేగా సండ్రను గెలిపించారని, గెలిచిన నాటి నుంచి ఆయన సత్తుపల్లి అభివృద్ధి కోసం అహర్నిశలూ కృషిచేశారని, తిరిగి నాల్గోసారి సండ్రను గెలిపించండని అభ్యర్థిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు వస్తుందని అన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను పంచుతూ నియోజకవర్గంలో సండ్ర చేపట్టబోయే మ్యానిఫెస్టో పత్రాలను అందజేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, 15వ వార్డు కౌన్సిలర్ వీరపనేని రాధిక బాబి, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు వల్లభనేని పవన్, అద్దంకి అనిల్, విజయనిర్మల, జొన్నలగడ్డ శ్రీను, కాంతారావు పాల్గొన్నారు.

సండ్ర తనయుడి ప్రచారం

తల్లాడ, నవంబర్ 23: సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోసం ఆయన తనయుడు సండ్ర తేజ మండలంలోని కుర్నవల్లి, ముద్దునూరు గ్రామాల్లో బుధవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న తన తండ్రి సండ్రను గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కుర్నవల్లికి మండలంలోనే అత్యధిక నిధులు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అయిలూరి లక్ష్మీ, సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, ఉపసర్పంచ్ పోతురాజు వెంకటయ్య, యువజన విభాగం నాయకులు దూపాటి నరేష్‌రాజు, శీలం శ్రీనివాసరెడ్డి, ఎక్కిరాల వెంకటేశ్వర్లు, అయిలూరి రామిరెడ్డి పాల్గొన్నారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి, నవంబర్ 23: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుపై ఓటు వేసి సండ్రను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెనుబల్లిలో జరిగిన ప్రచారంలో సర్పంచ్ తేజావత్ తావునాయక్, తేళ్లూరి నాగేశ్వరరావు, ఎస్‌కే గౌస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు వెంకటేశ్‌ను అభినందించిన కలెక్టర్

సత్తుపల్లి రూరల్, నవంబర్ 23: పట్టణంలోని గాంధీనగర్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేశ్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం అభినందించారు. వెంకటేశ్ నెలరోజులుగా ఓటరు అవగాహన, చైతన్యయాత్రను చేపట్టి ఓటర్లను చైతన్యపరుస్తూ మైకు ద్వారా గ్రామగ్రామాన తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సత్తుపల్లి వచ్చిన కలెక్టర్ వెంకటేశ్ ప్రత్యేకంగా అభినందించారు.

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వాహనం తనిఖీ

పవన్‌కల్యాణ్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

పెనుబల్లి, నవంబర్ 23: ఆంధ్రా నుంచి కొత్తగూడెం మీటింగ్‌కు కారులో వెళ్తున్న జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వాహనాన్ని గురువారం మండలంలోని ముత్తగూడెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అనంతరం పవన్‌కళ్యాణ్ అక్కడి నుంచి కొత్తగూడెం వెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టేకులపల్లి, నవంబర్ 23: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొమ్మిదో మైలుతండా గ్రామానికి చెందిన గుగులోత్ నవీన (30) ఈ నెల 18వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు భార్యతో గొడవపడి క్షణికావేశంలో పురుగు మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.చికిత్స పొందుతు గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

స్నేహితురాలికి చేయూత

రుక్మిణికి కుట్టుమిషన్ అందజేస్తున్న స్నేహితులు

సత్తుపల్లి టౌన్, నవంబర్ 23: 30 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న ఓ స్నేహితురాలి కుటుంబానికి బాసటగా నిలిచారు. సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరం పదోవ తరగతి పూర్తిచేసిన స్నేహితులు ఇటీవల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణానికి చెందిన స్నేహితురాలు అలివేలు ఏ తోడులేక ఆడపిల్లలతో కలిసి కుట్టు పని చేసుకుంటున్నది. ఆమె పరిస్థితిని తెలుసుకున్న స్నేహితులు తోటి స్నేహితులనుంచి రూ.30వేలు సేకరించి కుట్టుమిషన్ కొనుగోలు అందజేశారు. గురువారం వీరికి విద్యను బోధించిన గణితం ఉపాధ్యాయుడు రాంబాబు చేతులమీదుగా రుక్మిణికి అందజేశారు. కార్యక్రమంలో ఎండీ షబానా, మాధురి, నీరజ, సుగ్గల జయశ్రీ, వాణి, రమాదేవి, పల్లవి ఉన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత

బస్‌పాస్‌లు అందజేస్తున్న సర్పంచ్ నామా రాధమ్మ

కల్లూరు, నవంబర్ 23: మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో సర్పంచ్ నామా రాధమ్మ ఆధ్వర్యంలో సత్తుపల్లి డిపో పరిధిలో అర్హులైన దివ్యాంగులకు గురువారం ఉచితంగా బస్‌పాస్‌లు అందజేశారు. మధిర సబ్‌జైల్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బొడ్డు నర్సింహారావు, సుధ దంపతుల కుమార్తె చేతన జన్మదినం సందర్భంగా ఆర్హులైన దివ్యాంగులందరికీ ఉచితంగా బస్‌పాస్‌లు అందజేశారు. దివ్యాంగుల మధ్య కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, కంచి శ్యాంసన్, నామా వెంకటేశ్వర్లు, సంగెపు నారాయణ, సంగెపు వెంకటేశ్వర్లు, ముల్లంగి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేయాలి

కల్లూరు: అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్, సత్తుపల్లి: పోలింగ్ అధికారులతో కలెక్టర్ వీపీ గౌతమ్

సత్తుపల్లి, నవంబర్ 23: పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని బేతుపల్లి, గంగారం, అయ్యగారిపేట, ఎన్టీఆర్‌నగర్, పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెనుబల్లి మండలం వీఎం బంజరు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాలకు పెయింటింగ్ వేయించాలని, టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ సౌకర్యం ఉండాలని, మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తిచేయాలన్నారు. టాయిలెట్లకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో వెలుతురు కోసం లైట్లు ఏర్పాటు చేయాలని, ప్రహరీగోడపై ఓటర్లను అవగాహన పెంచేవిధంగా పెయింటింగ్ వేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఆర్‌అండ్‌బీ ఈఈ హేమలత, మున్సిపల్ కమిషనర్ సుజాత, పీఆర్ డీఈ నళినిమోహన్ అధికారులు పాల్గొన్నారు.

తల్లాడలో..

తల్లాడ, నవంబర్ 23: పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాల కల్పన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. గురువారం మండలంలోని పినపాక, వెంకటాపురం, నర్సింహారావుపేట, తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. ఓటును అమ్ముకుంటే, మనలను అమ్ముకున్నట్లేనని, ఓటును స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, నైతికలతో వేయాలని, ఇంట్లో ఓటు హక్కు వారందరికీ తెలపాలని కలెక్టర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రతిఓటరుకు ఓటరు సమాచారం స్లిప్‌లు అందజేయాలని, ఓటరు స్లిప్ తీసుకున్నట్లు రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, విద్యాశాఖ ఈఈ నాగశేషు, పీఆర్ డీఈ రాంబాబు, ఎంఈవో దామోదరప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేయాలి: కలెక్టర్

కల్లూరు, నవంబర్ 23: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, హనుమాతండా ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు, చేశారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో రవికుమార్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.